క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



నిజామాబాద్ రూరల్: జిల్లా సర్జన్స్ ఆధ్వర్యంలో బుధవారం కొత్తపేట్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు జీవన్‌రావుతో కలిసి మిగితా వైద్యులు గ్రామంలోని ప్రజలకు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు నరేందర్, రాహుల్, ప్రవీణ్ కుమార్, చౌహాన్, సుధాకర్, కృష్ణమూర్తి, భాస్కర్‌లు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో దుకాణం వేలం



నిజామాబాద్ రూరల్: నగరంలోని నీలకంఠేశ్వర స్వామి దేవస్థానం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం దేవాలయంలో బహిరంగ వేలంను ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీరాం రవీందర్ సమక్షంలో నిర్వహించారు. పూజా సామాగ్రి, టెంకాయ షాపు ఒక సంవత్సరానికి రూ.4,56,000 కు మురళి గౌడ్ అనే వ్యక్తి దక్కించుకున్నారు. ఈ ఏడాది గత సంవత్సరం కంటే రూ.21 వేలు అధికంగా వచ్చిందని ఆయన తెలిపారు. పాత రథాన్ని డిచ్‌పల్లికి చెందిన అశోక్ రూ.1.70 లక్షలకు దక్కించుకున్నారు.

ఓపెన్ ప్లాట్ బహిరంగ వేలం



సుభాష్‌నగర్: నగరంలోని నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(గోల్‌హనుమాన్ శాఖ)లో రుణం తీసుకొని, చెల్లించని ఎర్ర శ్రీనివాస్ ఓపెన్ ప్లాట్ నెంబర్–14కు బహిరంగ వేలం వేసినట్లు నోడల్ అధికారి అజయ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఎస్‌సీడీఆర్ ఉత్తర్వుల ప్రకారం తనఖా పెట్టిన లలితాంబ నగర్‌లోని 200 చదరపు గజాల ప్లాట్‌ను గోల్ హనుమాన్ శాఖలో వేలం వేయగా, టి.శ్రీనివాస్ సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. బ్యాంకులో రుణాలు పొంది సకాలంలో చెల్లించాలని, లేకుంటే తనఖా పెట్టిన స్థిరాస్తులను ఎస్‌సీడీఆర్ ప్రకారం వేలం నిర్వహించి రికవరీ చేస్తామని స్పష్టంచేశారు. ఎస్‌సీడీఆర్ ప్రతినిధి వసంత, నోడల్ అధికారి అజయ్‌రెడ్డి, రికవరీ అధికారులు పాల్గొన్నారు.

జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె



నిజామాబాద్ సిటీ: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, లేబర్ కోడ్‌ల రద్దును డిమాండ్ చేస్తూ జులై 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో నూర్జహాన్ మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. కనీస వేతనం, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు కాలరాశారన్నారు. నాయకులు శంకర్ గౌడ్, స్వర్ణ, మోహన్ పాల్గొన్నారు.

రైతును మోసం చేసిన వారిపై చర్య తీసుకోండి



నిజామాబాద్‌అర్బన్: రైతును మోసం చేసిన లోక భూపతిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారికి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లోక భూపతిరెడ్డి అనే న్యాయవాది ఖానాపూర్ గ్రామానికి చెందిన పెద్ద లక్ష్మి భూమి విషయంలో మోసానికి గురి చేశారని..దీనిపై విచారణ జరిపి చర్యలుతీసుకోవాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి)లో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు యాదాల నరేష్ ఆహ్వానం మేరకు బీజేపీ శాసనసభాపక్ష ఉప నేత పాయల్ శంకర్ బుధవారం ఆయన నివాసంలో తేనేటి విందు స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పాయల్ శంకర్ సూచించారు. ఆయన వెంట మాజీ రాష్ట్ర కార్యదర్శి మురళీధర్ గౌడ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శిథిలావస్థలో పురాతన భవనాలు

- వర్షానికి కూలుతున్న పాత ఇళ్లు
- కాలం చెల్లిన భవనాలను లెక్కిస్తున్న అధికారులు
- కూల్చివేయాలని నోటీసులు అందజేత



నెహ్రూ పార్కు లేబర్ అడ్డా వద్ద పాక్షికంగా కూలిన ఇరానీ హోటల్ భవనం

నిజామాబాద్ సిటీ: ఇందూరు నగరంలో పురాతన భవనాలు,నిర్మాణాలు శిథిలావస్థకు చేరాయి. కాలం చెల్లిన భవనాలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నాయి. కొన్ని ఇళ్లు నివాసం ఉండటానికి అనుకూలంగా లేవు. అయినా వాటిలో జనం నివసిస్తున్నారు. పెచ్చులూడుతున్న, గోడలు కూలుతున్నా తాత్కాలిక మరమ్మతులు చేయిస్తూ వాటిలోనే నివసిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున ఎడతెరపి లేకుండా వర్షం కురిస్తే పాత భవనాలు హఠాత్తుగా కూలిపోయే ప్రమాదం ఉంది. అందుకనే మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ పురాతన భవనాలను గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. 30 ఏళ్ల కంటే ముందుగా నిర్మించిన ఇళ్లు, భవనాలు, కట్టడాలు నిర్మాణాలు శిథిల భవనాల కిందకు వస్తాయి. వాటి నిర్మాణంలో వాడిన ముడి పదార్థాలను బట్టి ఆయా భవనాల సామర్థ్యాన్ని పరీక్షిస్తారు. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో పురాతన నిర్మాణాలు వందల సంఖ్యలో ఉన్నాయి. ముఖ్యంగా పాత నగరంలో దుబ్బ, కోటగల్లి, జెండాగల్లి, బురుడుగల్లి, గాజుల్‌పేట్, కంఠేశ్వర్, సుభాష్‌నగర్, ఖిల్లా, శివాజీనగర్, బ్రహ్మపురి కాలనీ, పులాంగ్, ఖలీల్‌వాడి, పెద్దబజార్, అర్సపల్లిల్లో పురాతన భవనాలు వందల సంఖ్యలో ఉన్నాయి. వీటిలో కొన్ని ఇప్పటికే శిథిలావస్థకు చేరి



పురాతన ఇంటికి నోటీసులు ఇస్తున్న బల్దియా సిబ్బంది

పాక్షికంగా ధ్వంసమయ్యాయి. నివాసానికి అనుకూలంగా లేవు. అయితే కొన్నింటిలో మాత్రం ఇప్పటికీ జనం నివసిస్తున్నారు. ప్రమాదం అని తెలిసినా సెంటిమెంట్‌తో వాటిని ఖాళీ చేయడం లేదు.

ఇప్పటి వరకు 60 నిర్మాణాలకు నోటీసులు..

నగరంలో పాత భవనాలను మున్సిపల్ అధికారులు గుర్తిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందిన ఇద్దరు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు(ఏసీపీ), ఇద్దరు టీపీఎస్‌లతోపాటు టీపీబీవోలు నగరంలోని డివిజన్లలో తిరుగుతూ పాత భవనాలను గుర్తిస్తున్నారు. వెంటనే కూల్చి వేయాల్సిన వాటికి నోటీసులు అందిస్తున్నారు. ఇప్పటివరకు 60 నిర్మాణాలు వెంటనే కూల్చివేయాలని నోటీసులు అందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నెహ్రూ పార్కు వద్ద నున్న ఇరానీ చాయ్ హోటల్ పురాతన భవనం పాక్షికంగా కూలిపోయింది. పైపెచ్చులు ఊడిపోయాయి. ఆ సమయంలో హోటల్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

పాత భవనాలను ఖాళీ చేయాలి



నగరంలోని పాత భవనాల్లో జనాలు నివసించొద్దు. ముఖ్యంగా మట్టి ఇళ్లు వర్షానికి తడిసి కూలిపోయే ప్రమాదం ఉంది.పాత భవనాలు, ఇళ్లు, నిర్మాణాలు ఖాళీ చేసి సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలి. శిథిలావస్థలో ఉన్నవాటికి నోటీసులు అందిస్తున్నాం.

– శ్రీనివాస్, ఏసీపీ, టౌన్ ప్లానింగ్

ప్రయివేట్ పాలిటెక్నిక్ కళాశాలలపై చర్యలు తీసుకోండి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రయివేట్ పాలిటెక్నిక్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు బుధవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ శశిధర్ మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల నుంచి పాలిటెక్నిక్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రావడం లేదన్నారు. కాని ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. ఫీజులు చెల్లించకుంటే సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో విద్యార్థులు పై చదువులకు వెళ్లాలంటే ఇబ్బందిపడుతున్నారని



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

పేర్కొన్నారు. నేతలు బాలకృష్ణ, శశాంక్, రంజిత్, మున్న దినేష్, ప్రేమ్, రాజు, సన్నీ, వాసు, సునీత, శ్రావణి, హేమ, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'కరెంటు సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం'

ధర్పల్లి: రెండు రోజులుగా ధర్పల్లి ఏజీఎల్ –2 ఫీడర్ తరచూ బ్రేక్‌డౌన్ అవడంతోపాటు వ్యవసాయానికి నిరంతరం కరెంటు ఉండడం లేదని ఆరోపిస్తూ రైతులు ధర్పల్లి సబ్ స్టేషన్‌కు తరలివచ్చి ఆందోళన చేపట్టారు. వరి నారు మడులు సిద్ధం చేయడానికి కరెంటు అంతరాయం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, ఉదయం పూట వరి నారుమడులకు నీరు పెట్టలేకపోతున్నామని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే విద్యుత్ సమస్యను పరిష్కరించాలని రైతులు అధికారులకు విన్నవించారు. విద్యుత్ సమస్యపై ట్రాన్స్‌కో ఏఈ నాగేశ్వర్‌ను వివరణ కోరగా.. రెండు రోజుల క్రితం వీచిన భారీ ఈదురు గాలుల వల్ల చెట్ల కొమ్మలు



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న రైతులు

విద్యుత్ వైర్లకి తగలడంతో ఆ ఫీడర్ బ్రేక్ డౌన్ సమస్య ఏర్పడ్డదని తెలిపారు. తమ సిబ్బంది బుధవారం ఉదయం మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించినట్లు ఏఈ పేర్కొన్నారు.

పెంచిన బస్ పాస్ చార్జీలను తగ్గించండి

ఖలీల్ వాడి: కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన బస్సు పాస్ చార్జీలను తగ్గించాలని నిజామాబాద్ బస్టాండ్ వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. చెవుల్లో పూలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. బస్సు పాస్ చార్జీలను 20 శాతానికి పెంచడాన్ని ఖండించారు. మహాలక్ష్మి స్కీంతో బస్సు పాసులు తీసుకున్న విద్యార్థులకు కనీసం సీట్లు దొరకని పరిస్థితి ఈ రాష్ట్రంలో ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు పాసులు కలిగిన విద్యార్థులకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గిరిరాజు కళాశాలకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్ఎం జ్యోత్స్నకు వినతి పత్రం అందించారు. జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, నగర అధ్యక్షులు ఆజాద్, నాయకులురాజు,అభి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూభారతి

డిచ్‌పల్లి: భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే తెలంగాణ ప్రభుత్వం దేశంలోని 18 రాష్ట్రాల్లో అమలు చేస్తున్న చట్టాలను సమగ్ర అధ్యయనం చేసి నూతన భూభారతి చట్టాన్ని అమలులోకి తెచ్చిందని డిచ్‌పల్లి తహసీల్దార్ కె.సతీష్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం అమృతాపూర్, ఆరేపల్లి గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. అమృతాపూర్‌లో 57, ఆరేపల్లిలో 27 దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, ఆర్ఐలు సంతోష్, భూపతి ప్రభు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీయూసీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న టీయూసీఐ నాయకులు

నిజామాబాద్‌సిటీ: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ కోరారు. బుధవారం జిల్లా కేందరలోని కోటగల్లీ ఎన్ఆర్ భవన్‌లో మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వనమాల కృష్ణ మాట్లాడుతూ.. 40 ఏళ్ల తర్వాత నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభ, టీయూసీఐ రాష్ట్ర ప్రధాన మహాసభలు జరుగుతున్నాయన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, 17 రాష్ట్రాల్లో టీయూసీఐ పనిచేస్తుందని తెలిపారు. మహాసభలను నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కె సుధాకర్, నాయకులు ఎం.నరేందర్, కే.రాజన్న, వెంకన్న, డి.రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన సిబ్బందికి అభినందన



ఏఎస్సైగా ప్రమోషన్ పొందిన వారితో సీపీ సాయి చైతన్య

ఖలీల్ వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్సైగా పదోన్నతి పొందిన సిబ్బంది.. పోలీస్ కమిషనర్ సాయి చైతన్యని మర్యాదపూర్వకంగా కలిశారు. కొంతకాలంగా ప్రమోషన్ గురించి ఎదురు చూస్తున్న హెడ్ కానిస్టేబుల్‌లకు ఏఎస్సైగా ప్రమోషన్ రావడంతో సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. ఏఎస్సైలకు సీపీ శుభాకాంక్షలు తెలియజేశారు. పదోన్నతి పొందిన ఏఎస్సైలు డి.మోహన్(టూటౌన్), ఎం.గంగాధర్ గౌడ్(ట్రాఫిక్ పీఎస్) ఎం.సత్తయ్య(వర్ని పీఎస్), టి.రవీందర్(మహిళా పీఎస్)లు ఉన్నారు. వీరికి స్టార్‌లు పెట్టి అభినందించారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మాట్లాడుతున్న డిచ్‌పల్లి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

డిచ్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లలకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని డిచ్‌పల్లి ఎంఈవో ఈఎల్ఎన్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం ఘన్‌పూర్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలోని స్కూల్ ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. వంట గదితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి

ఖలీల్‌వాడి: జిల్లా వ్యాప్తంగా ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులను సీజ్ చేయాలని, ఆయా విద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని నాగారంలోని రవాణా శాఖ అధికారి కార్యాలయంలో ఆర్టీఏ రాహుల్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 780 పైగా ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు ఉన్నాయని, విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న గాని పూర్తిస్థాయిలో అనేక బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించలేదన్నారు. పీడీఎస్‌యూ జిల్లా నాయకులు దేవిక, నిఖిల్, దుర్గాప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి జాతర



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

ధర్పల్లి: మండల కేంద్రంలోని ఊర చెరువు కట్టపై ఉన్న గంగమ్మ తల్లి ఆలయ జాతరను బుధవారం గంగపుత్రులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ చేశారు. ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివ పార్వతులను దర్శించుకున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువకులు

నిజామాబాద్‌నాగారం: రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ప్రముఖ ఛాతీ వైద్య నిపుణులు బొద్దుల రాజేంద్రప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో బుధవారం నిజామాబాద్ నగరంలోని రెడ్ క్రాస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది క్లబ్ సభ్యులు, యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ.. రక్తదానంపై అపోహలు ఉన్నాయని, అందులో నిజం లేదన్నారు. ఆరోగ్య వంతులైన వారు ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ బూస ఆంజనేయులు, కార్యదర్శి అరుణ్ బాబు, కోశాధికారి కరిపె రవీందర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎ.లింబాద్రి, జిల్లా అదనపు కార్యదర్శి పి.లక్ష్మినారాయణ, కోశాధికారి పి.రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మెంట్రాజ్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బుజ్జి, పిల్లలు, తల్లులు



నాందేవ్‌వాడలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా సంక్షేమ శాఖాధికారి రసూల్‌బీ

డిచ్‌పల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, మూడేళ్ల లోపు చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందజేస్తారని నడిపల్లి క్లస్టర్ అంగన్‌వాడీ సూపర్ వైజర్ బుజ్జి తెలిపారు. బుధవారం డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట' కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు, తల్లులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రి స్కూల్ పిల్లలతో సెల్ఫీ తీసుకున్నారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ బుజ్జి మాట్లాడుతూ..తల్లి, పిల్లలతో పాటు పుట్టబోయే బిడ్డల ఆరోగ్యం బాగుండాలని ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. మూడేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు.

అంగన్‌వాడీ బాట ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని నాందేవాడలో అంగన్‌వాడీ బాట ప్రారంభ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ హాజరై అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం బడి గంట కొట్టి ప్రారంభించారు. పిల్లలను చేర్పించడానికి ర్యాలీ నిర్వహించారు. కొత్తగా నమోదైన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఇన్‌చార్జి సీడీపీవో స్వర్ణలత, సూపర్‌వైజర్ ప్రియ పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీకి పంపించాలి



చీమన్‌పల్లిలో పాల్గొన్న చిన్నారులు

సిరికొండ: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ కుమారి సూచించారు. చీమన్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ బాటను బుధవారం నిర్వహించారు. అంగన్వాడి కేంద్రంలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు.

'ప్రభుత్వ పాఠశాలకే పిల్లలను పంపిస్తాం'

డిచ్‌పల్లి: తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకే పంపిస్తామని, ప్రయివేట్ పాఠశాలలకు పంపించబోమని డిచ్‌పల్లి మండలం సాంపల్లి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మేలయతండావాసులు బుధవారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. పిల్లలు రాకపోవడంతో గత విద్యాసంవత్సరం తండాలోని ప్రభుత్వ పాఠశాలను మూసి వేశారు. ఇంగ్లీషు మీడియం చదువు పేరుతో తండాకు చెందిన పిల్లలను తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపించడంతో ప్రభుత్వ పాఠశాల మూతబడింది. ఉపాధ్యాయుల చొరవతో ఈసారి పిల్లల తల్లిదండ్రులు బడీడు పిల్లలను తండాలోని సర్కారు బడికి పంపించాలని తీర్మానించారు. దీంతో గురువారం పాఠశాల పునఃప్రారంభం కానుంది. ఈ మేరకు పాఠశాల పునఃప్రారంభానికి ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



మేలయ తండా పాఠశాల ఆవరణలో సమావేశమై తీర్మానం చేస్తున్న తండావాసులు

జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు

మోపాల్: నిజామాబాద్ ఉమ్మడి జిల్లా అండర్–15 జిల్లా స్థాయి బాలబాలికల రెజ్లింగ్ పోటీలు మండలంలోని మంచిప్ప గ్రామంలో నిర్వహించారు. పోటీలో గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భక్తవత్సలం తెలిపారు. ఈ నెల 14న హైదరాబాద్‌లోని యాకుత్‌పుర అకాడమీలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారన్నారు. బాలికల విభాగంలో ప్రణతి(33 కేజీలు), రాజేశ్వరి(36కేజీలు), గౌరి(39కేజీలు), మహేక్(42 కేజీలు), సృజన(46కేజీలు) సువేణి(58 కేజీలు), హంసినీ(62 కిలోలు) అలాగే బాలుర విభాగంలో సనిత్(38కేజీలు), అర్జున్(41 కేజీలు), వెంకటేశ్(44కేజీలు), దీక్షిత్(52కేజీలు), సుశాంత్(57కేజీలు), కీర్తన్(62కేజీలు), కేనిత్ 75కేజీల విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. అలాగే ప్రత్యేక విభాగంలో అభిరాజు(38కేజీలు), సుదీప్(44 కేజీలు),ఆనంద్(46కేజీలు), సాయికుమార్(57కేజీలు), మణికంఠ(62కేజీలు) విభాగాల్లో విజయం సాధించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా దేవేందర్, సంతోష్,వినోద్, హిమబిందు వ్యవహరించారు.



విజేతలతో అసోసియేషన్ ప్రతినిధులు

క్రికెట్ జట్టుకు అభినందన

డిచ్‌పల్లి: రాంపూర్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలలో కమలాపూర్ జట్టు విజేతగా నిలిచింది. జట్టు క్రీడాకారులను డిచ్‌పల్లి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామస్తులు అభినందించారు. రాంపూర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. రాంపూర్‌జట్టును నాయకులు దత్తాత్రి, ఆశన్న అభినందించారు. 45 జట్లు పాల్గొన్నాయి.



కమలాపూర్ జట్టును అభినందిస్తున్న శ్రీనివాస్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)	
స్క్రీన్-1	థగ్‌లైఫ్ -1.25,7.35, 10.40
స్క్రీన్-2	శ్రీశ్రీశ్రీ రాజావారు-10.40, 4.40, 10.35 - భైరవం-1.40, 7.40
స్క్రీన్-3	హౌస్‌ఫుల్-5(హిందీ)-10.30, 1.25, 4.30, 7.35, 10.40
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)	
స్క్రీన్-1	కరాటే కిడ్ లెజెండ్స్-11.00, మిషన్ ఇంపాజిబుల్ (ఇంగ్లీష్)-1.15, భైరవం- 4.45, 10.35, భూల్ చుక్ మాఫ్(హిందీ)- 7.55
స్క్రీన్-2	హౌస్‌ఫుల్-5(హిందీ)-9.40, 3.40, 7.10, 10.40
	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-1.10
స్క్రీన్-3	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-11.30
	బద్మాషులు-2.00 ,థగ్‌లైఫ్-4.35, 10.40
	పాడేరు 12 మైలు-8.00
స్క్రీన్ -4	మిషన్007 - 11.05, హౌస్‌ఫుల్-5బి(హిందీ)- 1.40, శ్రీశ్రీశ్రీ రాజావారు- 5.10, 10.45, ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-8.15
లలితామహల్	భైరవం దేవి శ్రీశ్రీశ్రీ రాజావారు
నటరాజ్	హౌస్‌ఫుల్-5(హిందీ) విజయ్ థగ్‌లైఫ్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,200	వెండి(కిలో)	1,08,000
22 క్యారెట్స్	89,725		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	30	60
బెండకాయ	35	50	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	50	70	దోసకాయ	20	40
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	60	100	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిపువ్వు	40	60
వంకాయ	25	50	బీట్‌రూట్	25	50
పాలకూర	80	120	కరివేపాకు	40	60
మెంతికూర	100	140	చామగడ్డ	30	50
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	50	70
పుదీనా	70	100	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	90	మామిడికాయ	30	50

–సుభాష్‌నగర్